క్లుప్తంగా

పనులు త్వరగా పూర్తి చేయాలి



ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న ఏపీడీ బాలాజీ నాయక్

శిరివెళ్ల: మార్చిలోపు మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులు వందశాతం పూర్తి చేయాలని ఏపీడీ బాలాజీనాయక్ తెలిపారు. గురువారం రాజనగరం, గాంధీనగరంలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. అనంతరం ఉపాధి కార్యాలయంలో పనుల అమలుపై టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మండలంలో 2022–23 సంవత్సరంలో భాగంగా చేపట్టిన 85 శాతం పనులు జరిగాయన్నారు. ప్రతి రోజు కూలీలలకు పనులు కలిపించాలని 2023–24 ఆర్థిక సంవత్సరానికి కొత్త పనుల గుర్తింపు కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. కూలీల జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలని సూచించారు. ఆసక్తి గల రైతులను ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సహించాలని చెప్పారు. ప్రస్తుతం మండలంలో 234 మంది రైతులు వివిధ ఉద్యానవన పంటల సాగు చేస్తున్నారని గుర్తు చేశారు.

శిక్షణ కేంద్రం ప్రారంభం

నంద్యాల(అర్బన్): స్థానిక సాయిబాబానగర్‌లో గురువారం దివ్యాంగుల ఉచిత శిక్షణ పునరావాస కేంద్రాన్ని డిజేబుల్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్, అధ్యక్షుడు ముస్తాన్‌వలి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పునరావాస కేంద్రంలో అంధులు, వికలాంగులకు కంప్యూటర్, మ్యూజిక్, అగర్‌బత్తీలు, చాక్‌పీస్‌లు, కొవ్వొత్తుల తయారీలో శిక్షణ ఇచ్చి భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. సమితి నిర్వాహకులు మరియదాసు, ముస్తఫా, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

జీఓ రద్దు చేయాలి

నంద్యాల(అర్బన్): జీఓ నం.1 రద్దు చేయాలని సీపీఐ జిల్లా అధ్యక్షుడు రంగనాయుడు కోరారు. స్థానిక ఎస్‌టీయూ భవన్‌లో గురువారం సీపీఐ ఆధ్వర్యంలో పలు ప్రజాసంఘాలు, పార్టీల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రంగనాయుడు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై ధర్నాలు, నిరసనలు తెలియజేసే ప్రతిపక్ష నాయకులు, వామపక్ష సంఘాల నాయకులను అడ్డుకునేందుకే జీవో తెచ్చారన్నారు. జీవోను రద్దు చేసేంత వరకు పోరాటాలు సాగిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖలీల్, సీపీఐ నాయకులు బాబాఫకృద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతలయ్య, సీపీఎం నాయకులు నరసింహులు, ఐయూఎంఎల్ నాయకులు అబ్దుల్‌సలాం, ఏపీయూడబ్ల్యూజే నాయకులు శ్యాంసుందర్‌లాల్ పాల్గొన్నారు.

13 నుంచి సేబా మహిమోత్సవాలు

నంద్యాల(అర్బన్): స్థానిక దేవనగర్‌లో వెలసిన సేబా మినిస్ట్రీస్ 6వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 13, 14 తేదీల్లో సేబా మహిమోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ ఇమ్మానియేల్ శ్రీధర్ గురువారం తెలిపారు. విజయవాడకు చెందిన హదస్సా మినిస్ట్రీస్ పాస్టర్ రాజారావు ముఖ్యఅతిథిగా హాజరై ఉపదేశిస్తారని చెప్పారు.

ముగ్గుల పోటీలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి, దుర్గాశక్తి మహిళా విభాగం ఆధ్వర్యంలో స్థానిక టెక్కె మార్కెట్‌యార్డులో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గురువారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.ముఖ్యఅతిథిగా పబ్బతి వేణుగోపాల్, డాక్టర్ అరుణకుమారి, కౌన్సిలర్ కాల్వ సరస్వతమ్మ హాజరయ్యారు. మొదటి బహుమతి ఎస్.లక్ష్మీదేవి, రెండో బహుమతి మల్లేశ్వరి, మూడో బహుమతి రుషిత గెలుపొందారు. సభ్యులు బసవరాజు, రవి, నాగేశ్వరరెడ్డి, నాగరాజు, బలరాం, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(సిటీ): స్థానిక రోటరీ పాఠశాలలో ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. నంద్యాల జిల్లా కార్యవర్గ అధ్యక్షుడు సుబ్బన్న, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా భాస్కర్, దేవేంద్రుడు, సుంకన్న, అదనపు కార్యదర్శిగా రాజు, కార్యదర్శులుగా రాజశేఖర్, సాగర్, ప్రతాప్, చిరంజీవి, హరికృష్ణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. అనంతరం సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ కోలా ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు.

రేపటి నుంచి మల్లేశ్వరుడి ఉత్సవాలు

కొత్తపల్లి: మండల కేంద్రం కొత్తపల్లిలో వెలసిన శ్రీతాండవమల్లేశ్వరస్వామి తిరునాల ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. 14న స్వామివార్లకు బిందెసేవ, గణపతిపూజ, అంకురార్పణ, తాండవమల్లేశ్వరస్వామిని పెళ్లికుమారునిగా ముస్తాబు, 15న అర్ధరాత్రి కల్యాణం, 16న ప్రభోత్సవం, 17న పారువేటోత్సవం నిర్వహిస్తారు.

స్వచ్ఛ నంద్యాలగా తీర్చిదిద్దుతాం

- రూ. 5.25కోట్లతో లెగసీ వేస్ట్ క్లీనింగ్
- 70 వేల టన్నుల ఘనవ్యర్థాలను శుభ్రం చేయనున్న అధికారులు
- డంప్ యార్డు నుంచి వెలువడుతున్న విషవాయువులను అరికట్టేందుకు చర్యలు
- చెత్త శుద్ధీకరణ యంత్రాల ప్రారంభంలో ఎమ్మెల్యే శిల్పా రవి



యంత్రాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి



24వ వార్డులో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): స్వచ్ఛ నంద్యాలగా తీర్చిదిద్దేందుకు శ్రమిస్తున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణ శివారులోని డంప్‌యార్డులో ఘన వ్యర్థాలను శుభ్రం చేసే యంత్రాలను ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఘన వ్యర్థాల నుంచి వెలువడుతున్న విషవాయువుల నుంచి విముక్తి కలిగించేందుకు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పట్టణ గృహాల నుంచి వస్తున్న రోజువారీ చెత్తను డంప్ యార్డులో ఏళ్ల తరబడి నిల్వ ఉంచారన్నారు. అక్కడ ఉంచిన ఘన వ్యర్థాలను శుద్ధి చేయడానికి రూ. 5.25 కోట్లతో లెగసీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ప్రారంభించామని చెప్పారు. పట్టణాన్ని స్వచ్ఛ నంద్యాలగా తీర్చిదిద్దేందుకే ప్రభుత్వం ఖర్చుకు వెనుకాడకుండా లెగసీ వేస్ట్ కార్యక్రమం చేపట్టిందన్నారు. లెగసీ వేస్ట్ ద్వారా వర్మీకంపోస్టు ఎరువు తయారీ, ప్లాస్టిక్ వేస్ట్ మెటీరియల్‌ను సిమెంట్ ఫ్యాక్టరీల హీట్ బాయిలర్స్‌కి పంపడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం లభించనుందన్నారు. డంప్ యార్డులో సాగర్ మోటార్స్ వారు ఏర్పాటు చేసిన యంత్రాలతో ఎన్నో ఏళ్లగా పేరుకుపోయిన చెత్తను శుద్ధి చేసి డంప్ యార్డు సమీప ప్రాంత ప్రజలు విషవాయువు, పొగ, దుర్గంధం నుంచి ప్రజలకు విముక్తి కల్పించి మంచి వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. డంప్ యార్డులో ఉన్న 70వేల టన్నుల వ్యర్థాలను శుభ్రం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా, వైస్ చైర్మన్ పాంశావలి, కమిషనర్ రవిచంద్రారెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ ఇంజనీర్ రమణమూర్తి, డీఈఈ మధుకుమార్, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, ఎంహెచ్‌ఓ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి, సాగర్ మోటార్స్ ప్రతినిధి మహేంద్ర పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యం

నంద్యాల: ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించి వారి అభ్యున్నతికి కృషి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 24వ వార్డులో కౌన్సిలర్ షహనాజ్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని నాయకులు, మహిళలు హారతులు, గజమాలలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ, అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలోనే ఇచ్చిన హామీలు 96 శాతం మేర నెరవేర్చారని చెప్పారు. పథకాలు, అభివృద్ధి పనులతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, అందుకే తమకు ఎదురొచ్చి సంతోషంగా స్వాగతం పలుకుతున్నారని, ఈ ఆదరణ చూస్తే జగనన్నను ప్రజలు ఎంతగా ఆదరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. గతంలో టీడీపీ నాయకులు చెప్పిన వారికి ప్రభుత్వ పథకాలు వర్తించేవని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, కమిషనర్ రవిచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ పాంషావలి, న్యాయవాది శ్రీనివాసులు, వార్డు ఇన్‌చార్జ్ రహంతుల్లా, సచివాలయ ఉద్యోగులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

15న రథోత్సవం

నంద్యాల(వ్యవసాయం): 50ఏళ్ల తర్వాత పట్టణంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరసామి రథోత్సవం జరగనుంది. పురాతన సంప్రదాయానికి శ్రీభగవత్ సేవా సమాజ్ సంజీవనగర్ రామాలయం వారు నడుం బిగించారు. ఆలయ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమాజ్ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, మధుసూదన్, శ్రీనివాసులు మాట్లాడుతూ భోగి రోజున శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల కల్యాణం నిర్వహించి ఆదివారం సంక్రాంతి పండుగ సందర్భంగా నూతన మహారథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8గంటలకు సంజీవనగర్ రామాలయం నుంచి కోలాటం, చెక్కభజన, భజన, సాంస్కృతిక కార్యక్రమాలతో శ్రీనివాస సెంటర్, కల్పనా సెంటర్ మీదుగా గాంధీ చౌక్ వరకు వెళ్లి తిరిగి అదే మార్గంలో ఆలయం చేరుకుంటుందని వివరించారు. రథం లాగడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా మండలం బిల్లలాపురం గ్రామానికి చెందిన 30 మందిని తెడ్లు వేయడానికి ఏర్పాటు చేశామన్నారు. 16న ఉత్సవమూర్తులకు స్థానిక చిన్నచెరువు కట్ట వద్ద తెప్పోత్సవ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. కాగా.. నూతన రథాన్ని రూ.40 లక్షలు విరాళాలతో తమిళనాడు రాష్ట్రంలోని కోయల్ శిల్ప కళాకారులతో 4 టన్నుల బరువు, 18 అడుగుల ఎత్తు ఉండేలా తయారు చేయించామని చెప్పారు.



వేడులకు సిద్ధంగా ఉన్న నూతన రథం

ప్రారంభానికి సిద్ధమవుతున్న భవనాలు



బోడెమ్మనూరులో ప్రారంభోత్సవానికి సిద్ధంగానున్న రైతు భరోసా కేంద్రం



బోడెమ్మనూరులో తుది దశకు చేరుకున్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్

ఉయ్యాలవాడ: మండలంలోని బోడెమ్మనూరు గ్రామ సచివాలయ ఆవరణలో రూ.22 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.18,50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన సముదాయాల పనులు చివరి దశకు చేరుకున్నాయి. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, రసాయనిక ఎరువులు, సాంకేతిక పరిజ్ఞానం అందజేసేందుకు వీలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అలాగే గ్రామంలో అన్ని రకాల వ్యాధులకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వైద్యశాల త్వరలో వినియోగంలోకి రానున్నాయి. గ్రామంలోనే పటిష్టమైన సచివాలయ భవనాలు ఇప్పటికే ప్రారంభించారు. వాటికి అనుసంధానంగా పలు ప్రభుత్వ భవనాలు నిర్మించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ఇబ్బందులు రానీయొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: పంట ఉత్పత్తుల రాక మొదలైందని, రైతులకు ఇబ్బంది తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అధికారులు, పాలకమండలి సభ్యులకు సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమావేశ భవనంలో చైర్మన్ గంధం రాఘవరెడ్డి అధ్యక్షతన మొదటి పాలకమండలి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి గౌరవ చైర్మన్ హోదాలో ఎమ్మెల్యే హాజరయ్యారు. గత మూడు నెలలకు సంబంధించి మార్కెట్ యార్డ్ ఆదాయ, వ్యయాలపై సమీక్షించారు. 7 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసుకునేందుకు గోదాములు సిద్ధంగా ఉన్నాయని అందులో నిల్వ చేసుకునే రైతులు బస్తాకు నెలకు రూ.3 చొప్పున చెల్లించేలా తీర్మానం చేశారు. ప్రైవేటు గోదాముల్లో బస్తాకు రూ.8 వరకు బాడుగ తీసుకుంటున్నారని, రైతులు ప్రభుత్వ గోదాములను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు, ప్రభుత్వానికి వారధిగా అధికారులు, పాలకవర్గం పనిచేస్తూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సెక్రెటరీ నారాయణస్వామి, వైస్ చైర్మన్ నరహరి, డైరెక్టర్లు ఉన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

రుద్రవరం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వ్యక్తమైన సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో ఆయన 11 రోజుల పాటు కార్యక్రమంలో భాగంగా 1,2,3 గ్రామ సచివాలయాల పరిధిలోని పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమం ముగియడంతో గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఆయన పలు శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా వచ్చిన సమస్యలు.. వాటి పరిష్కారానికి నివేదికలను సిద్ధం చేసి పంపాలని సూచించారు. కార్యక్రమంలో పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీ బాలస్వామి, ఏడీ గిడ్డయ్య, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దారు వెంకటశివ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు





గాయపడ్డ సుబ్బారెడ్డి,పరిస్థితిని సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు...వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు పట్టణానికి చెందిన సుబ్బారెడ్డి, అంకాల్‌రెడ్డితో పాటు డ్రైవర్ కొండయ్యలు కారులో(ఏపీ04ఏఫ్1314) కర్నూల్‌కు వెళ్తుండగా సుగాలిమెట్ట వద్ద ముందు వెళ్తున్న టిప్పర్ సడన్‌గా ఎడమ వైపు తిరిగి కారును ఢీకొంది. ఈ ఘనటలో కారులోని ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులకు 108 వాహనంలో ఈఎన్‌టీ బాలతిమ్మయ్య ప్రథమ చికిత్స అందించి నంద్యాల సమీపంలోని శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డంగా వాహనాలు ఉండటంతో హైవేపై సుమారు అరకిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని దెబ్బతిన్న కారును బయటకు తీసి వాహనాలకు ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

దగ్గరుండి ఆసుపత్రికి పంపిన నంద్యాల ఎమ్మెల్యే :

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కావడంతో నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న నంద్యాల ఎమ్మెల్యే శిల్ప రవిచంద్రకిశోర్‌రెడ్డి సంఘటన స్థలం వద్దకు చేరుకొని గాయపడిన వారితో మాట్లాడి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. దగ్గరుండి 108 వాహనంలో క్షతగాత్రులను ఆస్పత్రికి పంపించారు. ట్రాఫిక్ సమస్య తీరే వరకు ఎమ్మెల్యే అక్కడే ఉన్నారు.

వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలి



వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



నివాళులర్పిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు



రక్త దానం చేస్తున్న సచివాలయ ఉద్యోగి

ఆళ్లగడ్డ: యువత స్వామి వివేకానంద ఆశయాలను, బోధనలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సూచించారు. స్వామి వివేకానంద జయంతి వేడుకలను పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఖండాంతరాల్లో భరతజాతి ఖ్యాతిని చాటిన మహోన్నత వ్యక్తి వివేకానందుడు అని కొనియాడారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, నాయకులు సీపీ శ్రీనివాసరెడ్డి, నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాయబ్ రసూల్ ఉన్నారు.

నంద్యాల(అర్బన్)/(సిటీ),(వ్యవసాయం): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ గురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశ అభివృద్ధిలో యువత పాత్ర అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర వహించాలని కోరారు. అనంతరం మౌలాలిరెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. లయన్స్‌క్లబ్ సభ్యులు కూరప్రసాద్, ఆర్ఎస్ ప్రసాద్, శివరామిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు. అలాగే నెరవాటి అమర్‌నాథ్, నాగేంద్ర మాట్లాడుతూ వివేకానందుడి సేవలను కొనియాడారు. నారాయణ, శంకర్, వాసు, పుల్లయ్య, కిరణ్‌కుమార్, గౌరీనాథ్, రమేష్ పాల్గొన్నారు. వివేకానందుడి జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ అన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో స్వామి వివేకానంద 160వ జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అధ్యాపకులు నివాళులర్పించారు. ఎస్వీ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు శ్రీనివాస సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీటీఓ పెద్దస్వామి, వైస్ ప్రిన్సిపాల్ శైలజారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని నంద్యాల రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పర్ల దస్తగిరి పేర్కొన్నారు. గురువారం ఉయ్యాలవాడలో రేనాటి సూర్యచంద్రుల సేవా సమితి ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. స్వామి వివేకానంద 160వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించగా పలువురు యువత, సచివాలయ ఉద్యోగులు పాల్గొని రక్తదానం చేశారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డి, సేవా సమితి ఆర్గనైజర్ కోట్లో బాబు, అబ్దుల్, ఆళ్లగడ్డ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): రియాసతి ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా క్యాలెండర్లను ఆవిష్కరించారు. గురువారం ఎమ్మెల్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూట ఉర్దూ పాఠశాలలు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. జిల్లా అధ్యక్షుడు జమాన్, సైఫుల్లా, జానీబాషా, దస్తగిరి బాషా, కలీం, కలీముల్లా, అతావుర్ రహిమాన్, రఫీ పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

స్థల పరిశీలన

నంద్యాల(సిటీ): గత కౌన్సిల్ సమావేశంలో కౌనిల్ సభ్యులు అడిగిన సందేహాలను నివృతి చేయడానికి, మున్సిపల్ స్థలాల పరిరక్షణకు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి చర్యలు చేపట్టారు. స్థానిక ఎన్జీఓ కాలనీలో మున్సిపాలిటీకి చెందిన స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి గురువారం సిటీ ప్లానింగ్ అధికారి నరసింహమూర్తితో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్జీఓ కాలనీలో ఉన్న 4.46 ఎకరాల మున్సిపల్ స్థలంపై పొన్నాపురానికి చెందిన మహిళ 2021లో స్టేటస్–కో వెళ్లినందున అప్పీల్ అడ్మిట్ చేసినట్లు చెప్పారు. కోర్టులో దావా వేసినందున స్థలాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడామని తెలిపారు.

14న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

జూపాడుబంగ్లా: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని తరిగోపుల గ్రామంలో ఈనెల 14న రాష్ట్ర స్థాయి న్యూకేటగిరీ విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కృష్ణారెడ్డి, జయశేఖరరెడ్డి, గోపాల్ రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సెల్ నెంబర్లు: 98668 68123, 96762 67969 నంబర్లకు ఫోన్‌చేసి రూ.600ల ప్రవేశరుసుము చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి

నంద్యాల(రూరల్): మండలంలోని పులిమద్ది గ్రామ సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న సురేష్‌రెడ్డిపై గురువారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. విధులకు హాజరయ్యేందుకు గ్రామానికి వెళ్తుండగా..గ్రామ శివారులో అప్పటికే ఉన్న ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు మాస్కులు ధరించి మూకుమ్మడిగా దాడి చేసి పారిపోయారు. అదే దారిలో వస్తున్న సర్పంచ్ రఘురామిరెడ్డి గాయాల పాలైన సురేష్‌రెడ్డిని నంద్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి మణిమోహన్‌రెడ్డితో కలిసి నంద్యాల తాలూకా పోలీసులకు తెలియజేశారు. ఈ విషయంపై తాలూకా ఎస్ఐ నాగరాజును వివరణ కోరగా.. దాడి జరిగిన విషయం తెలిసిందని, బాధితుడి నుంచి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గుత్తి రూరల్: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న 302 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకుని రెండు వాహనాలను సీజ్ చేశారు. వివరాలు.. బియ్యం తరలిస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు గురువారం ఉదయం గుత్తి మండలం బసినేపల్లి శివారులో విజిలెన్స్ అధికారులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఓ లారీతో పాటు బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గుర్తించి, వాటిని సీజ్ చేశారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. బియ్యం తరలిస్తున్న వాహనాల డ్రైవర్లు శ్రీనివాసులు, నరసింహులు, వ్యాపారులు నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన వడ్డే నాగరాజు, రామచంద్రపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ సీఐ వెంకటరమణ, డీసీటీఓ విజయలక్ష్మి, సీఎస్‌డీటీ కంబక్క తెలిపారు.



సీజ్ చేసిన వాహనాలను చూపుతున్న విజిలెన్స్ అధికారులు